# పరవళ్లు తొక్కుతున్న కుషావతి, చిత్రావతి నదులు

**- వీధుల్లోకి చేరిన వరదనీరు -పంట పొలాల్లోకి వరద నీరు చేరడంతో రైతులకు అపారనష్టం**



మరవకొత్తపల్లి చెరువు పారుతున్న దృశ్యం ,



వీధుల్లోకి వరద నీరు చేరిన దృశ్యం ,



కుషావతి నది ప్రవహిస్తున్న దృశ్యం

**చిలమత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

గురువారం రాత్రి కురిసిన వర్షాలకు కుషావతి, చిత్రావతి నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. అలాగే చెరువులు సైతం నిండి మరువలు పారుతున్నాయి. దీంతో లోతట్టు పొలాలను వరద నీరు ముంచెత్తింది. పంట చేతికి వచ్చే సమయంలో భారీ వర్షం ఒకింత రైతు కొంప ముంచిందని చెప్పవచ్చు. మండల వ్యాప్తంగా అధిక భాగం మొక్కజొన్న సాగుచేసిన రైతులు ఇక కోతకు వచ్చే సమయంలో ఊహించని వర్షం కారణంగా వరద నీటితో మునకకు గురికావడంతో రైతు భయాందోళన చెందుతున్నారు. గత ఏడాది ఇదే సమయంలో అధిక వర్షం కురవడంతో పంట మొత్తం మొలకలు వచ్చి దిగువడి బాగా తగ్గి తీవ్ర



మొక్కజొన్న పంటలోకి వరద నీరు చేరిన దృశ్యం

నష్టం వాటిల్లింది. ఈ ఏడాది కూడా పంట బాగా పండిన చివరి రోజుల్లో నిండా ముంచిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా చిలమత్తూరు, పాతచామలపల్లి, కొత్తచామలపల్లి, కోడూరు, కొడికొండ, దేమకేతేపల్లి, వీరాపురం, వెంకటాపురం వద్ద ఎక్కువ మొత్తంలో పంటలు నీట మునిగాయి. ఇక కుషావతి నది ఉధృతితో కోడూరుకు రాకపోకలు బంద్ కాగా పాఠశాలకు సెలవు ప్రకటించాల్సి వచ్చింది. అలాగే చిత్రావతి నది ఉధృతికి కొడికొండ రాకపోకలు, మొరసలపల్లి చెరువు, చిలమత్తూరు చెరువు మరువ కారణంగా ఆయా గ్రామాలకు రాకపోకలు బందయ్యాయి. ఇక నది పరివాహక ప్రాంతాల్లో మరువల వద్ద పోలీసులు పహారా నిర్వహించారు. ఇక కర్నాటకలో అధికంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నందులు మరింత ఉధృతంగా ప్రవహించే ప్రమాదం వుందని మండల ప్రజలు అప్రమత్తంగా వుండాలని తహాశీల్దార్ నాగరాజు తెలిపారు.

## పెళ్లి చేస్తారన్న మనస్థాపంతో విద్యార్థిని ఆత్మహత్య

**లేపాక్షి, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**

మండలంలోని పులమతి గ్రామంలో చదువుకునే వయసులో పెళ్లి చేస్తున్నారన్న మనోవేదన భరించకలేక పునీత (19) అనే విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ మునీల్అహమ్మద్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు పులమతి గ్రామానికి చెందిన పునీత చదువుకోవాలని చిన్ననాటి నుండి కలలు కనేదన్నారు. ఉన్నత చదువు చదివి ఉన్నత ఉద్యోగం చేయాలన్న దృఢసంకల్పంతో వున్న పునీతకు వివాహం జరిపించాలని ఆమె తండ్రి నాగప్ప నిశ్చయించాడు. దీంతో పునీత జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మోపురుగుండులో వాల్మీకి జయంతి వేడుకలు



వాల్మీకి జయంతి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

**గుడిబండ, అక్టోబర్ 14 ప్రభాతవార్త**

మండల పరిధి లోని మోపూరు గుండు గ్రామంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. వేటగాడి నుంచి మహర్షి వరకు వాల్మీకి జీవితాన్ని స్పూర్తిగా తీసుకుని ప్రతి మనిషి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవడానికి కృషి చేయాలని తెలిపారు. ఈ క్రమంలో గ్రామంలో శ్రీ మహర్షి వాల్మీకి విగ్రహం ప్రతిష్టాపన కార్యక్రమం, జ్యోతుల ఉత్సవం ఘనంగానిర్వహించారు. ఈ కార్యక్రమంలో మడకశిర నియోజకవర్గం వాల్మీకి సంఘం అధ్యక్షులు చంతపండు ఆనంద్, జిల్లా ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు పుట్టకామప్ప, గౌరవ సలహాదారు నాగరాజు, గుడిబండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి నరేంద్రకుమార్, వీరశైవ లింగాయత్, జిల్లా అధ్యక్షులు దుర్గేష్, నాయకులు దుర్గేష్, జిల్లా సంఘం సభ్యులునాగరాజు, మోపరుగుండు నటరాజు, ఉమేష్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

## ప్రాథమిక కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన డిఎంఅండ్ హెచ్ఓ

**శ్రీసత్యసాయి జిల్లా (వైద్యం), అక్టోబర్ 14, ప్రభాతవార్త**



సాంఘికసంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న డిఎంఅండ్హెచ్ఓ ఎస్.వి.కృష్ణారెడ్డి

పుట్టపర్తిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి ఎస్.వి.కృష్ణారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ తీరుతెన్నులు పరిశీలించి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం పరిశీలించి ఆరోగ్య సలహాలు తెలియపరచి తగు సలహాలు ఇచ్చారు. దోమల వల్ల వచ్చే వాధులను తెలియజేసి నివారణ చర్యలను సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి కుళ్ళాయప్పనాయక్, వైద్యాధికారులు నాగరాజు నాయక్, జ్యోత్స్న, సిహెచ్ఓ నగేష్, ఎఎంవో లక్ష్మినాయక్, పిహెచ్ఎన్ లలితకుమారి, ఎస్యుఓ రమణయ్య, సూపర్వైజర్ నాగరత్నమ్మ, వార్డెన్ మధుసూధన్ రెడ్డి, ఎంఎల్హెచ్పి చరన్య, ఆరోగ్య కార్యకర్త సుహాసిని, ఆశాకార్యకర్త అమృతలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలను కలసిన జిల్లా వైద్యాధికారి ఎస్వి కృష్ణారెడ్డి



ఎమ్మెల్యేను కలసిన నూతన జిల్లా వైద్యాధికారి ఎస్.వి.కృష్ణారెడ్డి

**పుట్టపర్తి, అక్టోబర్ 14, ప్రభాతవార్త** : శ్రీసత్యసాయి జిల్లా నూతన వైద్యాధికారి ఎస్వి కృష్ణారెడ్డి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. శుక్రవారం పుట్టపర్తిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నందు శ్రీధర్రెడ్డిని కలసి పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీసత్యసాయి జిల్లాలో ప్రజలకు రాజీలేని వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యేకోరారు. తను విధినిర్వామణలో శక్తివంచనలేకుండా అంకిత భావంతో వైద్యసేవలు అందిస్తానని ఎస్వి.కృష్ణారెడ్డి ఎమ్మెల్యేకు తెలియజేస్తూ పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోపాల్ రెడ్డి, వైసిపి నాయకుడు రామచంద్ర పాల్గొన్నారు.

## నారాలోకేష్ను కలసిన సామకోటి ఆదినారాయణ

**పుట్టపర్తిటౌన్, అక్టోబర్ 14, ప్రభాతవార్త** : టిడిపి జాతీయ కార్యదర్శి నారాలోకేష్ బాబును శ్రీసత్యసాయి జిల్లా టిడిపి కార్యదర్శి సామకోటి ఆదినారాయణ శుక్రవారం కలుసుకున్నారు. హైదరాబాద్లోని తన నివాసంలో కలసి సత్యసాయి చిత్రపటాన్ని అందజేసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా అక్కడి నుండి ఫోన్లో మాట్లాడుతూ, తాను మర్యాదపూర్వకంగా ఆయనను కలుసుకోవడం జరిగిందని తెలియజేశారు. పార్టీకోసం కష్టపడి పని చేయాలని, 2024 ఎన్నికలలో గెలుపేలక్ష్యంగా పని చేయాలని లోకేష్ సూచించినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధి, విజయానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పడం జరిగిందన్నారు. తనతో పాటు టిడిపి నాయకులు బేకరీనాయుడు, జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ సాయిప్రసాద్, వాల్మీకి సుధాకర్ పాల్గొన్నారన్నారు.

## రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తి

**గుంతకల్లు, అక్టోబర్ 14 ప్రభాతవార్త** : గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలో శుక్రవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే జిఆర్పి సిఐ నగేష్బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... గుంతకల్లు నుండి మద్దికెరకు వెళ్లు రైలుమార్గంలోని మల్లప్పగేటు సమీపంలో దాదాపు 45 నుండి 50యేళ్ల లోపు గల ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం ఉందన్నారు. సదరు మృతుని వివరాలు గుర్తించిన వారు తన సెల్ఫోన్ 94406 27667కు గాని, ఎస్సై మహేంద్ర సెల్ఫోన్ 98661 44616కు సమాచారం అందించి సహకరించాలన్నారు.

## టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా న్యాయవాది డాక్టర్ బిఎన్ కృష్ణారెడ్డి ఎంపిక



నారా చంద్రబాబుకు పూలబోకేను అందచేస్తున్న న్యాయవాది బిఎన్ కృష్ణారెడ్డి

**గుంతకల్లు, అక్టోబర్ 14 ప్రభాతవార్త** : పట్టణానికి చెందిన న్యాయవాది డాక్టర్ బిఎన్ కృష్ణారెడ్డిని టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శిగా తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సమక్షంలో గుంటూరు జిల్లా మంగళగిరి పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు పూలబోకేను సమర్పించి కృతజ్ఞతలను తెలుపుకున్నట్లు ఓ ప్రకటనలో ఆయన తెలిపారు. అలాగే తనకు అందిన పదవి పట్ల సహచర శ్రేణులకు కృతజ్ఞతలను అందచేశారు.

# ఉప్పెనలా చిత్రావతి పెరుగుతోంది

**-నీటి ఉధృతి లోతట్టు ప్రాంతాల ప్రజల పరిస్థితి అధోగతి**



పుట్టపర్తి సమీపాన కోవెల గుట్టపల్లి డ్యాం వద్ద చిత్రావతి నది ఉధృతి



రాయలవారిపల్లిలో చిత్రావతి నది పరిస్థితి

**పుట్టపర్తి, అక్టోబర్ 14, ప్రభాతవార్త**

పవిత్ర చిత్రావతి నది మహోగ్రరూపం దాల్చింది. ఉప్పెనలా కల్లోల్లాన్ని సృష్టిస్తోంది. క్షణక్షణం నీటి ఉధృతిని పెంచుకుంటూ శివుని ఝుటా జూఠం నుండి జారిపడిన గంగలా ప్రకృతి ప్రకోపాన్ని ప్రదర్శిస్తోంది. లోతట్టు ప్రాంత ప్రజానికాన్ని బిక్కుబిక్కుమంటూ ఆందోళనకు గురి చేస్తోంది. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి సమీపాన చిత్రావతినది పరివాహకప్రాంత పరిస్థితిఇది. ఆంధ్ర,కర్ణాటక, దక్షిణ ఎగువ ప్రాంతాలలో భారీ వర్షాలతో దంచి కొడుతున్నాయి. సుమారు ఐదు దశాబ్దాల క్రితం నాటి వర్షాభావ పరిస్థితులు పునరావృతం అవుతున్నాయి. ఈ ప్రాంతంలో గత యేడాది చిత్రావతి నదిసృష్టించి అల్లకల్లోలం అంతాఇంతకాదు. కృష్ణ, గోదావరిపరివాహ ప్రాంతాల పరిస్థితులను తలపిస్తూ తడారిన ఎడారి లాంటి ఒకప్పటి ఉమ్మడి అనంతపురం జిల్లాలో నేటి వర్షాభావ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఎటు చూసిన జలకళలు సంతరించుకొని వాగులు, వంకలు, నదులు పొంగిపోర్లుతున్నాయి. కుంటలు,చెరువులు, డ్యాములు నిండుకుండల్లా కళకళలాడుతున్నాయి. చుక్కనీటి కోసం వందల, వేల అడుగులకు బోర్లు త్రవ్వినా బీడు భూములు నీటిని కక్కుతూ ఊటబడ్డాయి. ఈ విధంగా శ్రీసత్యసాయి జిల్లాలో ఎటు చూసినా పచ్చదనం, జలకళ సంతరించు కొని ప్రకృతి పులకించిపోతోంది. ఇదే సమయంలో అతివృష్టి కారణంగా పశు, పక్షాదులు,ప్రజానికం అతలాకుతలం అవుతున్నాయి. రాయలసీమ కొనసీమను తలపిస్తున్నది. భగవాన్ సత్యసాయి బాబా అవతరించిన పుణ్యక్షేత్రం పుట్టపర్తి సమీపాన చిత్రావతి నది దృశ్యాలు ప్రజల్ని కనువిందు చేస్తూనే భయాందోళనకు గురి చేస్తున్నాయి.

# నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

**- రైతులు అధైర్య పడోద్దు - నష్టపోయిన రైతుల సమగ్ర నివేదిక తయారు చేయండి - ప్రభుత్వ విప్ కాపు**



సమావేశంలోమాట్లాడుతున్న ప్రభుత్వ విఫ్ కాపు

**రాయదుర్గం, అక్టోబర్ 14 (ప్రభాతవార్త)**

అకాల వర్షాలు కారణంగా రెండు మాసాలుగా కురుస్తున్న వర్షాలకు పంటలు నష్టపోయిన రైతన్నల సమగ్ర నివేదికను ప్రభుత్వానికి పంపాలని నియోజకవర్గం వ్యవసాయ అధికారులను రాయదుర్గం ఎమ్మెల్యే ప్రభుత్వ విఫ్ కాపు రామచంద్రారెడ్డి ఆదేశించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల వ్యవసాయ అధికారులు, సహా వ్యవసాయ సంచాలకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ పంట నమోదు ఈకేవైసి నమోదు గురించి మండలాల వారీగా సమీక్షించరు. ఈ పంట నమోదు, రైతు ఈకేవైసిని15 తేదీలోపు వాలంటరీ వ్యవస్థను వినియోగించుకుని 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ అక్టోబర్ మాసాలలో కురిసిన అధిక వర్షాలకు రైతులు పంట నష్టపోవడం జరిగింది. అధికారులు నష్టపోయిన ప్రతి రైతును నివేదికలలో చేర్చాలని సూచించారు. ఏ ఒక్క రైతులకు కూడా నష్టపరిహారం అందలేదంటే అందుకు వ్యవసాయ అధికారులే బాధ్యత వహించాలన్నారు. రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం అండగా ఉండి సహాయ సహకారాలు అందించి సహాయం చేస్తుందన్నా రు. చివరిగా సహాయ వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ నీటి ముంపుకు గురైన ప్రతి ఒక్క పొలలను తనిఖీ చేసి సమగ్ర నివేదికలను తయారు చేసి పై అధికారులకు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎల్. లక్ష్మీనాయక్, భాష, కృష్ణ కిషోర్రెడ్డి, నిర్మల్కుమార్, మహేంద్ర లు పాల్గొన్నారు.

# భారత్ జోడో పాదయాత్ర చూసి బీజేపీకి వణుకు

**- కేపీసీసీ అధ్యక్షుడు డి.కె.శివకుమార్**



పత్రికాగోష్టిలో మాట్లాడుతున్న కేపీసీసీ అధ్యక్షుడు డి.కె.శివకుమార్

**బళ్లారి, అక్టోబర్14, ప్రభాతవార్త ;**

ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్గాంధీ చేపట్టిన 'భారత్ జోడో పాదయాత్ర చూసి రాష్ట్రంలోని బీజేపీ నాయకులకు వెన్నులో వణుకు పుట్టిందని, వచ్చే ఎన్నికల్లో అధికారం కోల్పోతామన్న ఆందోళన నెలకొన్నదని, కాంగ్రెస్ పార్టీపై అక్రమాలు, కుంభకోణాలు జరిపినట్లుగా ప్రచారం చేస్తున్నారని, అది నిజమే అయితే బహిరంగ చర్చకు సీఎం బొమ్మై రావాలని, అందుకు తాను సిద్ధమేనని 'కేపీసీసీ అధ్యక్షుడు డి.కె.శివకుమార్ సవాల్ విసిరారు. నగరంలోని రాయల్ఫోర్ట్ హోటల్లో శుక్రవారం నాడు పత్రికాగోష్టిలో మాట్లాడిన ఆయన రాహుల్గాంధీ 'భారత్ జోడోపాదయాత్ర' శనివారం బళ్లారిలో జరిగే బృహత్ సమావేశానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు, సుమారు 3 లక్షల నుంచి 5 లక్షల మంది వరకు ఈ బహిరంగ సభకు హాజరవుకావొచ్చని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో ఆరోపణలు చేయలేనివారు, ఇప్పుడు కాంగ్రెస్ ఆక్రమణలు, కుంభకోణాలు చేస్తోందని, బహిరంగసభల్లో ముఖ్యమంత్రి బసవరాజబొమ్మై చెబుతుండడం అవివేకితనాన్ని కనబరుస్తున్నదన్నారు. తాను తనపై కూడా అక్రమాలు ఉన్నట్లుగా చెబుతున్న బీజేపీ నాయకులు అక్రమాలు చేయడం నిజమైతే మరి సీబీఐకి ఫిర్యాదు చేయవచ్చు కదా అని డి.కె.శివకుమార్ ప్రశ్నించారు. ఈ పాదయాత్ర బీజేపీ వారికి భీతి పట్టుకున్నదని, నోటికి వచ్చినట్లు అనవసర వ్యాఖ్యలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ప్రజల్లో శాంతి లేకుండా పోయిందని, కన్యాకుమారి నుంచి భారత్ జోడో యాత్ర ప్రారంభమయ్యిందని, మైసూరులో సమావేశం జరిపే ఉద్దేశం ఉన్నట్లు, అయితే దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నందున బళ్లారిలో శనివారంనాడు రాహుల్ బహిరంగ సభను పెట్టుకున్నట్లు, పైగా కన్యాకుమారి నుంచి ప్రారంభమైన జోడో యాత్ర బళ్లారి సరిహద్దు వరకు వెయ్యి కి.మీ. పాదయాత్ర రాహుల్గాంధీ చేశారని తెలిపారు. ఇదొక అపూర్వమైన పాదయాత్ర సాధన అని కాంగ్రెస్ పార్టీకి శక్తినిచ్చే భారీ పాదయాత్ర కాదని, ప్రజల్లో అశాంతిని తొలగించి, సమైఖ్య జీవనం సాగించేందుకే ఈ యాత్రను రాహుల్గాంధీ చేపట్టారన్నారు. శనివారం జరిగే రాహుల్ బహిరంగ సభకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి, ఆంధ్రప్రదేశ్ నుంచి ఇతర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరవుతున్నట్లు, 10 గంటలకు వేదిక వద్దకు చేరుకోవాలని పిలుపునిచ్చారు. ఈనెల 17వ తేదీన ఏఐసీసీ ఎన్నికలు జరగనున్నందున పాదయాత్రకు సెలవు ఉంటుందని, క్యాంపు సైట్లో ప్రత్యేక బూత్ ఏర్పాటు చేసి పోలింగ్లో రాహుల్గాంధీ పాల్గొంటారన్నారు. కేపీసీసీ ప్రచారసమితి అధ్యక్షుడు ఎం.బి.పాటిల్ మాట్లాడుతూ బీజేపీ వారు దేశాన్ని విభజన చేస్తున్నారని, అందుకే చెదిరిన మనస్సులతో బాధపడుతున్న ప్రజలను ఒక్కటి చేసేందుకు ఈ పాదయాత్రను రాహుల్గాంధీ చేపట్టారని, రాష్ట్రంలో 24 రోజులపాటు రాహుల్గాంధీ యాత్ర కొనసాగుతుందని చెప్పారు. రాజస్థాన్ సీఎం అశోక్గెహ్లోట్, ఛత్తీస్ఘడ్ సీఎం భూపేష్, మాజీ సీఎంలు కమలనాథ్, దిగ్విజసింగ్ తదితర నాయకులు కూడా పత్రికాగోష్టిలో పాల్గొంటారన్నారు. పత్రికాగోష్టిలో ఈశ్వర్కంద్రే, రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర, ఎంపీ డా. సయ్యద్నాసీర్ హు/సేన్, మాజీ ఎంపీ ఉగ్రప్ప, ఎల్.హనుమంతయ్య తదితర నాయకులు పాల్గొన్నారు.

## సత్యగ్రహ దీక్షకు రాకెట్ల వాల్మీకి సంఘం సంఘీభావం



బోయ ఈశ్వరయ్యకు సంఘీభావం తెలుపుతున్న దృశ్యం

**ఉరవకొండ, అక్టోబర్ 14 ప్రభాత వార్త** : వాల్మీకి బోయలను ఎస్టీ రిజర్వేషన్ వునరుద్ధరించాలన్న డిమాండ్తో విజయవాడలో వాల్మీకి సంఘం రాష్ట్ర నాయకులు కోనాపురం ఈశ్వరయ్య నేతృత్వంలో జరుగుతున్న సత్యాగ్రహ దీక్షకు రాకెట్ల వాల్మీకి సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. విజయవాడలో జరుగుతున్న దీక్ష శుక్రవారం 13వ రోజుకు చేరుకోగా దీక్షలో పాల్గొన్న నాయకులు న్యాయమైన హక్కును సాధించుకోవడం కోసం పోరాడుతున్న ఈశ్వరయ్యను సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు.

## లయన్స్క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ దృశ్య దినోత్సవం

**-జూనియర్ కళాశాలల విద్యార్థులతో ర్యాలీ, కంటి పరీక్షలు**



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, అక్టోబర్ 14 ప్రభాత వార్త** : ఉరవకొండ లయన్స్క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ దృశ్య దినోత్సవం జరిగింది. స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులతో కలిసి లయన్స్క్లబ్ ప్రతినిధులు కళాశాలవద్ద నుండి పట్టణ ప్రధాన వీధుల్లో క్లాక్టవర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు కంటి పరీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా లయన్స్క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన కళ్ళ కోసం బాదం, నిరింజ, క్యారెట్, చేప, పాలు, మోలకలు, ఎర్ర మిరియాలు, కాలే, పొద్దుతిరిగుడు విత్తనాలు, గుల్లలు, బ్రోకలీ, గుడ్లు ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. సర్వేంద్రియానం నయనం ప్రధానమని ప్రతి ఒక్కరూ తమ కళ్లను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాలల ఉమ్మడి ప్రిన్సిపాల్ ఎన్.మమత, లయన్స్క్లబ్ అధ్యక్షుడు సప్తగిరి మల్లికార్జున, రీజినల్ కో ఆర్డినేటర్ టి.గణేష్బాబు, సి.నాగేశ్వరరావు, రెడ్డి మాసి సత్యనారాయణ, కొమ్మసాని బాలచంద్ర అధ్యాపకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద మృతుని కుటుంబానికి రూ.3 లక్షలు సీయంఆర్ఎఫ్ సాయం

**-చెక్కును కుటుంబ సభ్యులకు అందించిన ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి**



సీఎంఆర్ఎఫ్ సాయం చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

**ఉరవకొండ, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**

నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామానికి చెందిన కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బోయ రమణమ్మ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరు అయిన 3 లక్షల రూపాయల ఆర్థిక సాయం చెక్కును ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి అందజేశారు. కొనకొండ్లలోని తన నివాసగృహంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మృతురాలి కుటుంబ సభ్యులకు చెక్కును అందజేసి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## అవినీతి, నిరుద్యోగంపై భారత్ జోడో యాత్ర ; రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర



పత్రికాగోష్టిలో మాట్లాడుతున్నఎమ్మెల్యే

**బళ్లారి, అక్టోబర్14, ప్రభాతవార్త** ; దేశంలోనూ, రాష్ట్రంలోనూ మితిమీరిన అవినీతి, నిరుద్యోగంకు వ్యతిరేకంగా రాహుల్గాంధీ 'భారత్ జోడో యాత్రను' ప్రారంభించారని రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర తెలిపారు. శుక్రవారం నగరంలో అల్లంభవన్లో పత్రికాగోష్టిలో మాట్లాడిన ఆయన తాలుకాలోని హాళకుంది గ్రామానికి రాహుల్గాంధీ చేరుకుంటారని, అక్కడి మఠంలో రాహుల్గాంధీ బస చేస్తారని, జిల్లా కాంగ్రెస్ సమితి తరపున రాహుల్గాంధీని 500 నుంచి 700 మందికళాబృందాల కళాకారులు ఘనంగా స్వాగతం పలుకుతారని పేర్కొన్నారు. 15న శనివారంనాడు హాళకుంద గ్రామం నుంచి ఉదయం 6 గంటలకు పాదయాత్ర ప్రారంభిస్తారు. నగరంలోకి ప్రవేశించిన తర్వాత బెంగళూరు రోడ్డు ద్వారా రాహుల్గాంధీ పాదయాత్ర చేసి నగరంలోని కమ్మ భవన్లో విశ్రాంతి పొందుతారని, బళ్లారి, కొప్పళ, విజయనగర జిల్లాల నుంచి 15 తాలుకాల నుంచి 5 లక్షల మంది బహిరంగ సభకు హాజరవుతారని, ఇందుకోసం మున్సిపల్ కాలేజీ మైదానంలో 1.50 లక్షల మందికి ఉచిత భోజన వ్యవస్థ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పత్రికాగోష్టిలో కాంగ్రెస్ నాయకులు రాంప్రసాద్, పి.జగన్నాథ్, శ్రీశైల, ముదిమల్లయ్య పాల్గొన్నారు.

## హత్యకేసు ముద్దాయి అరెస్ట్



ముద్దాయి స్వామినాయక్ను అరెస్ట్ చూపుతున్న టూటౌన్ పోలీసులు.

**గుంతకల్లు, అక్టోబర్ 14 ప్రభాతవార్త** : పట్టణ పరిధిలోని తిలక్నగర్ ప్రాంతంలో ఈ నెల 12వ తేదీన జరిగిన హత్య కేసుకు సంబందించి ముద్దాయి గుండాల తాండా గ్రామంకు చెందిన స్వామినాయక్ను శుక్రవారం అరెస్ట్ చేసి న్యాయస్థానంకు తరలించినట్లు టూటౌన్ సిఐ చిన్నగోవిందు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... తిలక్నగర్ ప్రాంతంలో నివాసముంటున్న తన భార్య మంగమ్మతో తనకు సమీప బంధువైన సుంకానాయక్ అక్రమ సంబందం ఉందని, దీంతో వారి పట్ల కక్ష్య ధోరణిలో హైదరాబాద్లో బ్రతుకుతెరువు వృత్తి నుండి 11వ తేదీ గుంతకల్లుకు చేరుకుని ఇంటి వద్ద కాపు కాశాడన్నారు. ఉదయం ఇంట్లో వారిరువురు ఉండటంను గుర్తించి కత్తితో దాడి చేసి సుంకానాయక్ను హత్య చేశాడన్నారు. ఈక్రమంలోనే తన భార్య మంగమ్మను కట్టెతో దాడి చేసి గాయపర్చి పరారరయ్యాడన్నారు. సదరు హత్య కేసులోని ముద్దాయిని ఉదయం పాత గుత్తిరోడ్డులో తమకు తారసపడటంతో అరెస్ట్ చేశామన్నారు. సదరు సంఘటనలోని ముద్దాయిని అరెస్ట్ చేసి కేసు పూర్వాపరాలను విచారణలో సేకరించి న్యాయస్థానం ముందు హాజరుపర్చగా న్యాయాధిపతి ముద్దాయిని 15రోజులు రిమాండ్ విధించారన్నారు.

## కర్నాటక మద్యం స్వాధీనం...

**ముగ్గురు ముద్దాయిలు అరెస్ట్...**

**గుంతకల్లు, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**

పట్టణ పరిధిలోని రెండు ప్రాంతాలలో అక్రమంగా కర్నాటక రాష్ట్రంకు చెందిన మద్యంను స్వాధీనం చేసుకుని వాటి విక్రయదారులైన ముగ్గురు ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు టూటౌన్ సిఐ చిన్నగోవిందు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... ప్రభుత్వ నిభంధనలకు విరుద్ధంగా కర్నాటక రాష్ట్రంకు చెందిన మద్యం ప్యాకెట్లను అక్రమంగా విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. సదరు సమాచారంతో తమ సిబ్బంది రాయల్ సర్కిల్, సరస్వతీ విద్యామందిరం సమీప ప్రాంతాలలో విక్రయాలు సాగిస్తున్న గడేకల్లు వెంకటేష్, వీరేష్, నరసింహులు అనే వారిని అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుండి 90ఎంఎల్ 78 టెట్రా ప్యాకెట్లు రూ.2,730ల విలువ గల మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. సదరు ముగ్గురు విక్రయదారులను అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపర్చగా న్యాయాధిపతి 15రోజులు రిమాండ్కు ఆదేశించారన్నారు.

## ప్రకృతి వ్యవసాయంను పరిశీలించిన జర్మనీ బృందం


గంటాపురంలో కూరగాయల పంటను పరిశీలిస్తున్న జర్మనీ బృందం

బత్తలపల్లి, అక్టోబర్ 14 ప్రభాతవార్త : మండలంలోని గంటాపురం గ్రామంలో సాగవుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని జర్మనీకి చెందిన సిజిఐఏఆర్ బృందం శుక్రవారం సందర్శించారు. గ్రామంలో సభ్యులు డాక్టర్ అలోక్ సిక్కా, స్వాతి రెండచింతల, స్మిత కృష్ణన్, థామస్‌పాక్, సారా, సుదర్శన్, ప్రాప్తి బరూహ్యా, శ్వేత గుప్తా, ప్రాచి, తేజశ్విణి, రవీంద్రలతో కూడిన బృందం తొలుత ముత్యాలప్ప సాగు చేసిన కూరగాయల పంటను పరిశీలించారు. పంట ఆరోగ్యం చూసి ఆదాయ, వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సుహాషిణి సాగుచేసిన కంది, నాగేంద్రమ్మ సాగు చేసిన వేరుశనగ పంటలను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులతో పాటు సన్న, చిన్నకారు రైతులతో కలసి ప్రకృతి వ్యవసాయం పద్ధతులు, సాగులో లాభాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడడం వలన సమస్యలు, ఆదాయ, వ్యయాల గురించి అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమంలో ఐబి సుకన్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చేపలవేటకు వెళ్లిన వ్యక్తి మృతి


మృతిచెందిన సత్యనారాయణ

బత్తలపల్లి, అక్టోబర్ 14 ప్రభాతవార్త : చిత్రావతి నదిలోకి చేపలవేటకు వెళ్లిన వ్యక్తి వలలో చిక్కుకుని మృతిచెందాడు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని చెన్నరాయపట్నం గ్రామానికి చెందిన సత్యనారాయణ(35) శుక్రవారం చేపలవేటకు వల తీసుకుని సంఘమేశ్వరం క్షేత్రం వద్ద వున్న చిత్రావతి నది వద్దకు వెళ్లాడు. అక్కడ నదిలోకి వల విసిరిన తరువాత అదుపుతప్పినదిలో పడ్డాడు. నదిలో పడిపోయిన విషయాన్ని అక్కడున్న వారు గ్రామస్థులకు చేరవేశారు. గ్రామస్థులు వచ్చి వలను బయటకు తీయగా వలలో చిక్కుకుని ఊపిరాడక మృతిచెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విషయం ఆరాతీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసు పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు వున్నారు.

## స్వచ్ఛందంగా మట్టి రోడ్డు నిర్మాణం.. వర్షం ధాటికి ధ్వంసం


వర్షం ధాటికి పాడైన మట్టి రోడు

అగళి, అక్టోబర్ 14 ప్రభాతవార్త : గత 45 రోజుల క్రితం అప్పుడు కురిసిన వర్షానికి మండలంలో రోడ్లు, కల్వర్టులు ధ్వంసం అయ్యాయి. అగళి-ఆర్‌జి హళ్లి మధ్యలో రామాపురం కల్వర్టు వర్షం ధాటికి ధ్వంసమైంది. అదే విధంగా అగళి-కొమరేపల్లి రోడ్డు వర్షం ధాటికి పాడైపోయింది. అదే విధంగా అగళి-ఇరిగేపల్లి కల్వర్టు వర్షం ధాటికి పాడై పోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అగళి-కొమరేపల్లి రోడ్డుకు ప్రజలు స్వచ్ఛందంగా మట్టిని వేసి తాత్కాలికంగా తిరగడానికి రోడ్డు వేసుకున్నారు. అదే విధంగా అగళి, రామాపురం, రోడ్డుకు జడ్పిటిసి ఉమేష్ తాత్కాలికంగా ఇనుప వంతెనను నిర్మించడంతోపాటు ప్రజలతోపాటు అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులు మట్టిరోడ్డు నిర్మించారు. అయినా గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షానికి అగళి చెరువు మరువ ఉధృతంగా పారడం, కొమరేపల్లిదగ్గర ఏరుఉధృతంగాపారడంతో రెండుచోట్ల రోడ్డు పాడైపోయింది. ప్రజలు ప్రయాణించడానికి ఇబబ ంది పడుతున్నారు. సంబంధిత అధికారులుచొరవ తీసుకుని నూతన రోడ్డు నిర్మాణం, కల్వర్టుల నిర్మాణానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## పట్ట భద్రుల ఓటు నమోదులో టీడీపీ నాయకులు


నమోదు కార్యక్రమాన్ని చేస్తున్న దృశ్యం

అగళి, అక్టోబర్ 14 ప్రభాత వార్త : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి ఓటు నమోదు కార్యక్రమాన్ని జడ్పిటిసి ఉమేష్ కార్యాలయంలో తెలుగు దేశం నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులైన వారితో ఓటును నమోదు చేయడానికి దరఖాస్తులను భర్తీ చేశారు. మండలంలోని 50 గ్రామాల్లో 2019 సంవత్సరంలో డిగ్రీ ఉత్తీర్ణులైన వారిని గుర్తించి పట్టభద్రుల ఓటరు నమోదు చేసే కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమేష్, ఐదు మండలాలకు పట్టభద్రుల కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్న రామకృష్ణ, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు శ్రీనివాస్, కన్వీనర్ కుమారస్వామి, శివరాజ్, జయరామ్, రఘు, వెంకటేష్ తదితరులు పాల్గొని ఓటరు నమోదుపై అవగాహన కల్పించడంతోపాటు నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

## విద్యార్థులు డ్రగ్స్‌కు బానిక కావద్దు - ఏఎస్ఐ


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్ఐ శ్రీరాములు

అగళి, అక్టోబర్ 14 ప్రభాతవార్త : కళాశాలలో చదివే విద్యార్థులు డ్రగ్స్‌కు బానిస కాకూడదని ఎఎస్ఐ శ్రీరాములు అన్నారు. అగళి కెజివి గుప్తా డిగ్రీ కళాశాలలో మత్తు మందుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో కష్టపడి కళాశాలకు పంపుతారని, అలాంటి వారు బాగా చదివి కళాశాలకు, తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. మత్తుమందు భారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. అదే విధంగా బ్రహ్మకుమారి సంస్థ వారు కూడా మంచి భవిష్యత్తు, కష్టపడే తత్వం అలవర్చుకుని బాగుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి శ్రీనివాస్, కరస్పాండెంట్ హనుమంతరాయప్ప, ట్రస్టీమెంబర్ కిష్టప్ప, జమేదార్ సూర్యప్రకాష్, ప్రిన్సిపాల్ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి ఆత్మహత్య


వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన దృశ్యం

గుత్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త : పట్టణంలోని జంగాలకాలనీలో నివాసం వుండే రంగన్న (45) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొంతకాలంగా అతను తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మనస్థాపానికి గురై ఈ అఘాయిత్యానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. తొలుత అతను అనారోగ్యంతో మృతి చెందాడని బావించినప్పటికి చివరికి ఆత్మహత్యగా తేలింది. మృతునికి భార్య, ముగ్గురు సంతానం వున్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకై సైనికుల్లా పోరాడండి

- పెనుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జిఎం శేఖర్


మాట్లాడుతున్న జిఎం శేఖర్

పెనుకొండ, అక్టోబర్ 14 ప్రభాతవార్త : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి గెలుపుకు సైనికుల్లా పోరాడండని పెనుకొండ నియోజకవర్గం ఇన్‌చార్జ్ కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు జిఎం శేఖర్ పార్టీ శ్రేణులకు పిలువునిచ్చారు. శుక్రవారంపట్టణంలోని వాసవి కళ్యాణ మండపంలో రాబోయే రాయలసీమ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బిజెపి జిల్లా అధ్యక్షులు వజ్ర భాస్కర్‌రెడ్డి, కదిరి మాజీ ఎమ్మెల్యే ఎంఎస్ పార్థసారధి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యులు పెనుకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జిఎంశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిఎం శేఖర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి మండలంలో పట్ట భద్రుల ఓటరు నమోదుకు పార్టీ శ్రేణులు చొరవ చూపాలన్నారు. పార్టీ అభ్యర్థి విజయం కోంస ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వారివారి పరిధిలో ఉన్న పట్టభద్రులను ఓటర్ల నమోదుకు చొరవ చూపాలన్నారు. ఈ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ అభ్యర్థి విజయం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా ఇన్‌చార్జ్ పిడి పార్థసారధి పెనుకొండ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక ఇన్‌చార్జ్ వేణుగోపాల్, జిల్లా ఎస్సీ మోర్చ అధ్యక్షులు ఏ రామకృష్ణ, జిల్లా ఫైనాన్స్ కమిటీ కన్వీనర్ రామాంజినేయులు, విశ్వహిందూ పరిషత్ పెనుకొండ అధ్యక్షులు శవేద వ్యాస స్వామి, ఆర్‌ఎస్‌ఎస్ స్వయం సేవకులు, కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


హాజరైన బిజెపి నాయకులు, కార్యకర్తలు

## భక్త కనకదాసు విగ్రహం వితరణ

- విగ్రహం అందజేసిన సవిత


కనకదాసు విగ్రహం అందిస్తున్న సవిత

పెనుకొండ, అక్టోబర్ 14 ప్రభాతవార్త : తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత కురుబల ఆరాధ్య దైవం కనకదాసు విగ్రహాన్ని వితరణ చేశారు. శుక్రవారం పట్టణంలోనిహెచ్‌పి పెట్రోల్‌బంక్ వద్ద రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం గరిమేకలపల్లి కురుబ కులస్తులకు కనకదాసు విగ్రహాన్ని అందించారు. గ్రామంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు తన వంతు సహాయం అందించామన్నారు. ఈ సందర్భంగా కురుబ కులస్తులు సవితను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాధవనాయుడు, గుట్టూరు మాజీ సర్పంచు సూర్యనారాయణ, డ్వాక్రా రామాంజినేయులు, అడదాకులపల్లి మాజీ సర్పంచు ప్రసాద్, త్రివేంద్రనాయుడు, క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్ సభలో సోమందేపల్లి మండల వాసులు


రాహుల్ పాదయాత్రలో సోమందేపల్లి మండల వాసులు పాల్గొన్న దృశ్యం

సోమందేపల్లి, అక్టోబర్ 14 ప్రభాతవార్త : కాంగ్రెస్ యువ నాయకుడు రాహుల్ గాంధీ నేతృత్వంలో భారత్‌జూడో పాదయాత్ర ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలోని అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం డి హీరేహాళ్ గ్రామంలో జరిగినసందర్భంలో మండలానికి చెందిన సత్యసాయి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు రంగేపల్లి గంగాధర్, మాజీ సర్పంచు విశ్వనాథరెడ్డిలతోపాటు పలువురు పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 8 నుంచి 10 కిలోమీటర్ల మేర పాదయాత్రలో నడిచి వెళ్లారు. రాయదుర్గం మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొన్నారు. వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నట్లు వారు తెలిపారు. ముఖ్యంగా రాహుల్ పాదయాత్రకు పెద్ద ఎత్తున ప్రజల నుంచి స్పందన లభించిందని, స్వచ్ఛందంగా వేలాదిగా తరలి వచ్చారని వారు తెలిపారు.

## రాయంపల్లి గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం


మలేరియా నిర్మూలణ పోస్టర్లు ప్రదర్శిస్తున్న ఆరోగ్య, సచివాలయ సిబ్బంది

ఉరవకొండ, అక్టోబర్ 14 ప్రభాతవార్త : మండల పరిధిలోని రాయంపల్లి గ్రామంలో శుక్రవారం డ్రై డే కార్యక్రమం జరిగింది. గ్రామ సర్పంచ్ సుజాత, పంచాయతీ కార్యదర్శి వశికేరి మహేష్‌ల ఆధ్వర్యంలో మలేరియా నిర్మూలణ పోస్టర్లను ప్రదర్శించారు. అనంతరం గ్రామ సచివాలయ, ఆరోగ్య సిబ్బంది ఉదయం భారీ వర్షాలకు గ్రామంలో ఏర్పాడిన నీటి గుంటల్లో దోమల గుడ్లు పొదగకుండా లార్వా చనిపోయేందుకై ఆయిల్ బాల్స్ వేసి పలు ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుజాత మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శుక్రవారం ఇంట్లో నీటిని నిల్వచేసే పాత్రలన్నింటినీ ఖాళీచేసి కడిగి ఎండలో ఆరబెట్టుకొని కొత్త నీరు పట్టుకోవాలని అలా చేయడంవల్ల డెంగ్యూ జ్వరానికి కారణమయ్యే పగటి పూట కుట్టే దోమలు నశిస్తాయన్నారు. వ్యక్తిగల శుభ్రత పాటించడంతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి వశికేరి మహేస్ మాట్లాడుతూ దోమలు కుట్టకుండా దోమ తెరలు, మస్కిటో కాయిల్స్, వేపాకు పొగా వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త నిమ్మల వెంకటేష్, సచివాలయ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఐటీఐలో 4వ విడత ప్రవేశాలకు 19లోగా దరఖాస్తు చేసుకోవాలి

-కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నాగరాజు

ఉరవకొండ, అక్టోబర్ 14 ప్రభాతవార్త : పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ఉపాధి కల్పిన శిక్షణశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు 4వ విడత ప్రవేశాలకు అర్హతకల్గిన అభ్యర్థులు ఈనెల19వతేదీలోగా ఆన్‌లైన్‌లోదరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నాగరాజు కోరారు. శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు ఐటీఐ.ఎపి.జిఒవి.ఇన్ అనే వెబ్‌సైట్ ఐటీఐలోమిగిలివున్నసీట్లు డి.ఎంసివిల్, రిఫ్రిజినేషన్‌అండ్‌ఎయిర్ కండిషనింగ్, డ్రస్ మేకింగ్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తీ అయిన తరువాత ఒరిజినల్ సర్టిఫికేట్లు తీసుకొనివచ్చి దగ్గరలోనున్న ఏ ప్రభుత్వ ఐటీఐలోనైనా ఈనెల 20వతేదీలోగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. పట్టణంలోని గాంధీ బజార్‌లోగల ఐటీఐ భవనంలో 21న అడ్మిషన్ కౌన్సిలింగ్ ప్రక్రియ ఉదయం 10 గంటల నుండి ప్రారంభమవుతుందన్నారు. సర్టిఫికేట్లు వెరిఫికేషన్ పూర్తీ అయిన విద్యార్థులు మాత్రమే ఒరిజినల్ సర్టిఫికేట్లతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

## విద్యుత్ షాక్ మృతుల కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం


మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మలకు కృతజ్ఞతలు తెలుపుతున్న బాధిత కుటుంబ సభ్యులు

ఉరవకొండ, అక్టోబర్ 14 ప్రభాతవార్త : విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన కూడేరు మండలం ఉదిరి పికొండ గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు ఆదినారాయణ, వెంకటేశులు కుటుంబానికి విద్యుత్‌శాఖ ద్వారా మంజూరు అయిన 10 లక్షల రూపాయల పరిహారం మంజూరు కావడంతో బాధిత కుటుంబ సభ్యులు మారెక్క, మహేశ్వరిలు గురువారం మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. గత 2020 అక్టోబర్ 3న శివరాంపేట గ్రామం సమీపంలోని పెన్నా నదిలో మోటారు మరమ్మతులు చేస్తూ ఇరువురూ విద్యుత్ షాక్‌కు గురై తండ్రీ కొడుకులు మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో బాధిత కుటుంబ సభ్యులు తమను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికు విన్నవించారు. దీంతో ఆయన జరిగిన ఘోరాన్ని విద్యుత్‌శాఖ, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన క్రమంలో మృతులు ఒక్కొక్కరికి 5 లక్షల రూపాయల వంతున పరిహారం మంజూరు కాగా వారి బ్యాంకు ఖాతాల్లో విద్యుత్‌శాఖ జమ చేశారు. ఈక్రమంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనడానికి కూడేరుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డితోపాటు, జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మలను బాధిత కుటుంబ సభ్యులు కలిశారు. తమ కుటుంబాన్ని ఆదుకున్నారంటూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితోపాటు పరిహారం మంజూరు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం అధ్యాపక, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

-ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసరెడ్డి

ఉరవకొండ, అక్టోబర్ 14 ప్రభాత వార్త : రాష్ట్రంలోని వివిద కళాశాలలు, పాఠశాలల్లో పనిచేస్తున్నటువంటి అధ్యాపకులు, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలలు, గురుకుల, ఆదర్శ, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి అధ్యాపకులు, ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకొని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఒంటేరు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఏకీకృత సర్వీస్ నిబంధనల సమస్య పరిష్కారమైతే విద్యారంగంలో పదోన్నతుల ప్రక్రియ ముందుకు సాగుతుందన్నారు. కేంద్రంతో సంప్రదింపులు జరిపి అమలు చేయాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్ల సర్వీసు మొత్తంలో ఒక్క పదోన్నతి కూడా లభించడంలేదని, వారికి ఇటీవల ప్లస్ టు విద్యా ప్రవేశపెట్టిన పాఠశాలల్లో జూనియర్ అధ్యాపకులుగా పదోన్నతులు కల్పించాలన్నారు. ఉపాధ్యాయులను మధ్యాన్నం భోజనం పర్యవేక్షణ బాధ్యతల నుండి తప్పించి ఎస్ఎంసీలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షులు ఆదిశేషయ్య, శివమూర్తి, డీడబ్ల్యూటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఆపస్ జిల్లా అధ్యక్షులు ఎర్రిస్వామి, సీపీఎస్ నాయకులు రామాంజినేయులు, ప్రభాకర్, రామన్న, గోపాలప్ప, శర్మస్, హరినాథ్, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్..!

-కూడేరు గడప గడపకు మన ప్రభుత్వంలో జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


ప్రజలకు బ్రోచర్లు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ, అక్టోబర్ 14 ప్రభాతవార్త : సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నియోజకవర్గంలోని కూడేరు మండల కేంద్రంలో శుక్రవారం కొనసాగింది. తొలుత దివంగత సీయం వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించిన అనంతరం అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించే బ్రోచర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నేరవేర్చుతూ వస్తున్నారన్నారు. జగన్ పాలన ఇతర రాష్ట్రాలకు నేడు రోల్ మోడల్‌గా మారిందని ఇక్కడ అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ఇతర రాష్ట్రాలు, దేశాలు అధ్యయనం చేస్తున్నాయన్నారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి తప్పక ఆదుకుంటుందని ఎవ్వరూ ఆధైర్యపడవద్దన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ నారాయణరెడ్డి వైస్ ఎంపీపీ సుబ్బమ్మ, మండల అగ్రి అడ్వైజరీ బోర్డు ఛైర్మెన్ నిర్మలమ్మ, ఎంపీడీఓ కమాల్‌బాషా, హౌసింగ్ ఏఈ రాజశేఖర్, నాయకులు బైరెడ్డి రాజశేఖరరెడ్డి, సుబ్బమ్మ, స్థానిక నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుత్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త :గుత్తి మున్సిపాలిటీలో పాటు గ్రామీణ ప్రాంతాల్లో శనివారం విద్యుత్‌సరఫరాలో అంతరాయంఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఇంజనీర్ కుమార్ ఒకప్రకటనలోతెలిపారు. 33కెవి సబ్‌స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 9 నుండి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందన్నారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని మెరుగైన విద్యుత్ సరఫరా కోసమే పునరుద్దరణ పనులు చేపట్టనున్నట్లు ఇంజనీర్ వివరించారు.

## అప్పుల బాధ తాళలేక వ్యక్తి మృతి


ఉరివేసుకున్న వ్యక్తి

అమరాపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త : మండల పరిధిలో బసవన్న పల్లి గ్రామానికి చెందిన దాసరి నరసప్ప కుమారుడు రామాజినేయులు (41) అప్పల బాధ తాళలేక శుక్రవారం తన ఇంటిపై కప్పుదులానికి ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన శు క్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశ్వర్లు మృతుని కుటుంబీకులు తెలిపిన వివరాల మేరక మృతుడు అనారోగ్యంతో బాధపడుతుండగా రోగం నయం చేసుకోవటానికి భారీగా అప్పులు చేసుకున్నాడని.. అప్పుల బాధ తాళలేక జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబీకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసు _న్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందులో హెడ్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన కల్పించిన ఆదిశక్తి సొసైటీ లీగల్‌క్యాంప్


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి, అక్టోబర్ 14 ప్రభాతవార్త : మండల పరిధిలోని యర్రోనిపల్లి గ్రామంలో టింబక్టు కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఆదిశక్తి సొసైటీ లీగల్ క్యాంపు ఏర్పాటు చేసి బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి స్వయం శక్తి సిబ్బంది సమ్మెతో కలెక్టరేట్ సిబ్బంది ఆదిశక్తి పాలకవర్గం హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలపై నాటిక రూపంలో బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో వక్తలు మాట్లాడుతూ.. అమ్మాయిలకు వారి తల్లిదండ్రుల సహకారం ప్రేమ సమయం వారితో కేటాయించి వారితో కలిసి ఆలోచనలు పంచుకుటూ వారి యొక్క అభిప్రాయాలకు విలువ ఇస్తే అమ్మాయిల భవిష్యత్తు బాగుటుందదని అన్నారు. అలాగే బాల్య వివాహాలు జరిగితే వాటి నుంచి కలిగే నష్టాలను తెలియజేశారు. అలాగే కుటుంబంలో స్త్రీ పాత్ర ఎంత విలువైంది అని స్త్రీ లేకపోతే సమాజం ఎలా ఉంటుంది అని నాటక రూపంలో ఆదిశక్తి సిబ్బంది మహిళలకు తెలియజేశారు.

## వాలంటీర్ల ద్వారా ఓటు నమోదు చేయించడం దుర్మార్గమైన చర్య

- ఆదేశాలు భేఖాతారు చేస్తున్న అధికారులను శిక్షించాలి
- అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం టిఎన్ఎస్ఎఫ్ ఆగ్రహం


మాట్లాడుతున్న టిఎన్ఎస్ఎఫ్ నాయకులు

రొద్దం, అక్టోబర్ 14 ప్రభాత వార్త : అత్యంత ప్రతిష్ఠాత్మకంగా సాగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోరులో ప్రతి ఓటు హక్కు కీలమైనది. ఇలాంటి తరుణంలో పెనుకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఓటు హక్కును గ్రామ వాలంటీర్ల ద్వారా నమోదు చేయించడం దుర్మార్గమైన చర్య అని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం పెనుకొండ టిడిపి కార్యాలయంలో నాయకులు మాట్లాడుతూ అనేక గ్రామాల్లో వాలంటీర్లు ఓటు నమోదు కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు తమకు సమాచారం వచ్చిందన్నారు. వాలంటీర్లు ఓటు నమోదు లో జోక్యం చేసుకోకూడదని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది.అయితే వాలంటీర్లు ఓటు నమోదు చేస్తున్నారు. కానీ ఏ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తూ ఆదేశాలను తుంగలోకి తొక్కి కొనసాగిస్తున్నారని.. చర్యలు తీసుకుని సస్పెండ్‌తోపాటు శిక్షించాలని డిమాండ్ చేశారు. త్వరలో జిల్లా ఎన్నికల సంఘం అధికారి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బోయ హరికృష్ణ, పెనుకొండ అధ్యక్షులు అధికార ప్రతినిధి హరీష్, సానిపల్లి వెంకటేష్, ప్రధాన కార్యదర్శి సాయి, కార్యదర్శి సతీష్ లు పాల్గొన్నారు.

## శ్రీమంత కార్యక్రమంలో టిడిపి నాయకులు



రొద్దం, అక్టోబర్ 14 ప్రభాతవార్త : పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలం గౌరాజుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రాజప్ప కుమార్తె శ్రీ మంత కార్యక్రమంలో శుక్రవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి సత్యసాయి టీడీపీ జిల్లా అధ్యక్షులు పెనుకొండ నియోజకవర్గం ఇంచార్జ్ బి.కె. పార్థసారథి తరుపున సాయి కళ్యాణ్ హాజరై రాజప్ప కుమార్తెను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ నరహరి, పెనుకొండ నియోజకవర్గం టిడిపి అధ్యక్షులు చిన్నప్పయ్య, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, సర్పంచ్ నాగరాజు, మాజీ సర్పంచ్ నారాయణ, బి.కె సోము, చంద్రశేఖర్ నాయుడు, గ్రామ కమిటి అధ్యక్షులు సోమశేఖర్, టిఎన్ఎస్ఎఫ్ సాయి కిరణ్, ఉబ్బరాయుడు, మండల డీలర్ వెంకటేష్, నారాయణ కృష్ణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి నాయకుని కుమార్తె శ్రీమంతానికి హాజరైన టిడిపి సవితమ్మ


శ్రీ మంత కార్యక్రమంలో టిడిపి సవితమ్మ

రొద్దం, అక్టోబర్ 14 ప్రభాతవార్త : పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలం గౌరాజుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు రాజప్ప కుమార్తె శ్రీ మంత కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మతోపాటు టీడీపీ సీనియర్ నాయకులు మాధవనాయుడు, చంద్రమౌళి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు ఆంజినేయులు, మాజీ ఎంపిపి నరసింహులు మాజీ సర్పంచ్ నారాయణ, సుబ్బరాయుడు, క్రిష్టప్ప, సోము, తిమ్మయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.ఆమెను ఆశీర్వదించి పండంటి బిడ్డకు జన్మనివ్వాలని ఆకాంక్షించారు.

## రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు మృతి.. ఒకరికి తీవ్ర గాయాలు


మృతి చెందిన సంజీవరెడ్డి

రొద్దం, అక్టోబర్ 14 ప్రభాతవార్త : మండలం రాగిమేకలపల్లి గ్రామానికి చెందిన సంజీవరెడ్డి (65) ద్విచక్రవాహనంలో సొంత పనుల మిత్తం రాయచూరుకు వెళ్లి పనులు ముగించుకుని తిరిగి ద్వాక్రవాహనంలో స్వగ్రామానికి బయలు దేరి వస్తుండగా రాయచూరు వద్ద ద్విక్రవాహనం అదుపు తప్పింది. దీంతో సంజీవరెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు అయిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది.

## ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా


ట్యాంకర్ల ద్వారా గ్రామాల్లో నీటి సరఫరా చేస్తున్న దృశ్యం

అమరావురం, అక్టోబర్ 14 ప్రభాతార్త : మండల పరిధిలో గౌనకుంట గ్రామంలో భారీ వర్షం కారణంగా రోడ్లలో భారీ నీటి ప్రవాహం ఉండటంతో ప్రజలకు తాగునీటి లేక ఇబ్బందులు పడుతున్న సందర్భంగా మండల ఎంపిపి లలితమ్మ, కుమారుడు వైసీపీ యువనాయకుడు రంజీత్‌కుమార్ లు ప్రత్యేక ట్యాంకర్ ద్వారా తాగునీరు ప్రజలకు సరఫరా చేశారు. తాగునీటి సరఫరా కాకపోవడంతో బయటకు వెళ్లలేని పరిస్థితి. ప్రజల సమస్యల ను దృష్టిలో ఉంచుకుని నీరు సరఫరా చేయడంతో ప్రతి ఇంటి నుంచి మహిళలు వచ్చి నీరు తీసుకెళ్లి అభినందించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి, బుడ్డలింగప్ప, తిమ్మరాజు తదితరులు పాల్గొన్నారు.

## గొరవనహాళ్లిలో నేడు గడపగడపకు

పరిగి, అక్టోబర్ 14 ప్రభాతవార్త : మండలంలోని మోదా పంచాయతీ గొరవనహళ్లి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే శంకర్‌నారాయణ శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని వైకాపా మండల కన్వీనర్ నరసింహామూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి వైకాపా నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

